**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**రాష్ట్ర కమిటీ సమావేశం జనవరి 30, 2016న విజయవాడలో జరిగింది. సమావేశంలో ఆమోదించిన తీర్మానాన్ని ప్రచురణార్థం పంపుతున్నాము.**

**ఆర్. లక్ష్మయ్య**
**ఆఫీసు కార్యదర్శి**

## తీర్మానం

బిజెపితో జట్టుగట్టిన టిడిపి మత దురహంకారాన్ని, మేధావుల హత్యలను, మైనారిటీల మీద దాడులను, రోహిత్ ఆత్మ హత్యతో సహా ఏ ఒక్క దారుణ సంఘటనమీద కూడా స్పందించడంలేదు. ఖండించడంలేదు. తద్వారా మతోన్మాద శక్తులను బలపరుస్తున్నది.

రాష్ట్ర ప్రభుత్వం రైతులనుండి బలవంతంగా భూమిని గుంజుకొని కార్పొరేట్లకు ఇవ్వడం, కార్పొరేట్లు కోరిన విధంగా ప్రభుత్వ విధానాలను మార్చడం తప్ప ప్రజా సమస్యలను పరిష్కరించే పనిలో లేదు. తాజాగా మూసివేసిన స్కూళ్ళను కార్పొరేట్లకు ఇస్తామని, రవాణా శాఖను ఏకంగా 5కార్పొరేట్ సంస్థలకిస్తామని, రిజిస్ట్రేషన్ శాఖను కూడా ప్రైవేటుకు అప్పచెప్పడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్మిక హక్కులను హరించేసి యజమానులకు బానిసలుగా మార్చే విధంగా బిజెపి పాలిత రాజస్థాన్, గుజరాత్ తరహా సవరణలు కార్మిక చట్టాలకు చేస్తున్నారు. కార్పొరేట్ సేవలో బాబు ప్రభుత్వం మునిగి తేలుతున్నది. ప్రజా నిరసనలు కూడా సహించే స్థితిలో లేదు. తీవ్రమైన నిర్బంధంతో ప్రజా ఉద్యమాన్ని అణచివేతకు పూనుకుంటున్నది.

సంపన్నులకు, కార్పొరేట్లకు భూ పందేరంతోసహా అనేక రాయితీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కష్టజీవులకు, చిరుద్యోగులైన ఆశా, అంగన్‌వాడీ, కాంట్రాక్టు – ఔట్‌సోర్సింగ్ తదితరులకు ఇవ్వాల్సిన ఇండ్ల స్థలాలు, సబ్సిడీలు, అలవెన్సులను ఇవ్వకపోవడాన్ని సిపియం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. కరువు, అనావృష్టితో నష్టపోయిన రైతులు, వ్యవసాయ కార్మికులకు సహాయ చర్యలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలమైంది. సగానికిపైగా మండలాలను కరువు పీడితమైనవిగా ప్రకటించడం తప్ప కనీస సహాయం కూడా చేయలేదు. ఉపాధిహామీ పనులను 150 రోజులకు పెంచుతామని ప్రకటించారే తప్ప ఆచరణలో ప్రారంభమే కాలేదు. ఫలితంగా గ్రామీణ పేదలు పనికోసం ఇతర రాష్ట్రాలకు వలసపోవాల్సి వస్తోంది.

విశాఖలో భాగస్వామ్య సదస్సు సందర్భంగానూ, దావోస్ పర్యటన సందర్భంగానూ జరిగిన ఒప్పందాలతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తాయని రాష్ట్ర ప్రజానీకాన్ని భ్రమలకు గురిచేస్తున్నారు. కేంద్ర వాణిజ్యశాఖ ప్రచురించిన వివరాలు చూసినా కుదిరిన ఒప్పందాల విలువలో సుమారు 10% మాత్రమే ఆచరణలోకి వస్తున్నాయి. 2012లో 7% మాత్రమే వచ్చాయి. కొత్తగా వస్తుందంటున్న ఉపాధి రావడం మాట అటుంచి ఉన్న ఉపాధిని కార్మికులు కోల్పోతున్నారు. జూట్, ఫెర్రోఎల్లాయిస్, మినిస్టీల్ తదితర పరిశ్రమలు మూతపడి వేలాదిమంది ఉపాధి కోల్పోయారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేదంటూనే ప్రభుత్వం విదేశీ పర్యటనలు, ఆర్భాటపు ఖర్చులు భారీగా చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధుల సాధనపై కనీస శ్రద్ధ పెట్టడంలేదు. ప్రత్యేకహోదా ఊసేలేదు.



**"త్రిప్పి చూడగలరు"**

చిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతామని ప్రకటించినా జి.వో విడుదల చేయకుండా నిలిపి వేసింది. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, గృహనిర్మాణశాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ టీచర్స్‌ను తొలగించినట్లే తాజాగా ఆరోగ్య మిత్రలను తీసివేయడానికి జి.వో జారీ చేసింది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ మాటేలేదు. కనీసం 10వ పిఆర్‌సి ప్రకారం వేతనాలనైనా పెంచలేదు. మున్సిపల్ వర్కర్ల ఉపాధిని హరించేలా వర్క్ ఔట్‌సోర్సింగ్‌కై 279 జి.వోను తెచ్చి వారి మెడపై కత్తిపెట్టింది.

2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వం ఇప్పుడు ఆ చట్టం స్ఫూర్తిని వమ్ముచేస్తూ రాష్ట్ర చట్టాన్ని రూపొందించడానికి నల్సార్ విశ్వవిద్యాలయానికి బాధ్యత అప్పజెప్పింది. 2013 చట్టంలో కీలకమైన సామాజిక ప్రభావ అంచనా వంటి వాటిని తొలగించడానికి, ప్రైవేటు అవసరాలకు కూడా "ప్రజా ప్రయోజనం" పేరిట భూములు గుంజుకోవడంకోసం సవరణలు చేయ ప్రయత్నిస్తున్నది. దళితులు, గిరిజనులు, ఇతర పేదల సాగు, అనుభవంలో వున్న అసైన్డ్, ప్రభుత్వ భూములను ల్యాండ్ బ్యాంక్ పేరిట స్వాధీనం చేసుకోవడానికి, పెద్దలు కాజేసిన అసైన్డ్ భూములకు రెగ్యులరైజేషన్ పేరిట చట్టబద్ధత కల్పించడానికి ప్రయత్నం చేస్తున్నది.

భోగాపురం ఎయిర్‌పోర్టు విషయంలో హైకోర్టు రైతులకనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. గతంలో రైతులనుండి గుంజుకున్న భూముల్లో పరిశ్రమలు పెట్టకపోయినా ఇప్పుడు మరలా బందరు, భావనపాడు పోర్టులు, సోలార్ పార్కులు, పరిశ్రమల పేరుతో భూములను బలవంతంగా గుంజుకోవాలన్న ప్రయత్నిస్తూనే వున్నది. పోలవరం ప్రాజెక్టు భూసేకరణ, పునరావాసంలో తీవ్రమైన నిర్లక్ష్యంతోపాటు ద్వంద్వ విధానం అమలు జరుగుతున్నది. వంశధార, తోటపల్లి, పులిచింతల తదితర సాగునీటి ప్రాజెక్టులలో నిర్వాసితుల పునరావాస సమస్యలు అపరిష్కృతంగా వున్నాయి. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రాజెక్టు బాధిత ప్రజానీకానికి నష్టపరిహారం చెల్లించడంతో పాటు పునరావాస, పునర్నిర్మాణ ప్రయోజనాలను కల్పించాలని సిపియం డిమాండ్ చేస్తున్నది.

నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిలో వికేంద్రీకరణ సూత్రాన్ని అమలు చేయాలని శివరామకృష్ణన్ కమిటీతో సహా ఎందరు మేధావులు చెప్పినా వినకుండా రాజధాని పేరున కేంద్రీకరణ నమూనాతోనే ముందుకు మొండిగా సాగుతున్నది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. హంద్రీ-నీవా, గాలేరు-నగరి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వ అశ్రద్ధ అందుకు నిదర్శనం. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల పారిశ్రామిక, విద్యాభివృద్ధికి తగు చర్యలు చేపట్టడంలేదు.

రాజధానిలో రైతులకు, వ్యవసాయ కార్మికులు, వృత్తిదార్లకు ఇచ్చిన హామీలను వేటినీ ప్రభుత్వం అమలు జరపడంలేదు. రాజధాని ప్రాంతంలో గ్రామకంఠాల వివాదాన్ని పరిష్కరించలేదు. మరోవైపు భూములిచ్చిన రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లు వారు కోరుకున్నచోట్ల ఇవ్వకుండా నమ్మకద్రోహం చేస్తున్నది. ఆయా గ్రామాల మధ్యనుండి రోడ్లు సమస్య ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. రాజధాని నిర్మాణంపై సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంటామని మొదటినుండి చెబుతూ వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ప్రైవేటు కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నది.

విశాఖ ఏజెన్సీలో మావోయిస్టులు చేసిన హత్యను ఆసరాగా చేసుకొని సిపియం, వైఎస్సార్ తదితర పార్టీల కార్యకర్తలను, నాయకులతోపాటు బాక్సైట్ వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న గిరిజనులను అరెస్టు చేసి మర్డర్ కేసు బనాయించి రోజుల తరబడి కోర్టుకు కూడా ప్రొడ్యూస్ చేయకుండా భయానక వాతావరణాన్ని సృష్టించి బాక్సైట్ వ్యతిరేక ఉద్యమాన్ని దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నది. తెలుగుదేశం ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ ప్రజా వ్యతిరేక విధానాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది.

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రజా సమస్యలపై వివిధ ప్రజా సంఘాలు, సంస్థలు అనేక రూపాల్లో ఆందోళనలను ప్రకటించాయి. న్యాయమైన డిమాండ్లపై చేపడుతున్న ఆందోళనా, పోరాటాలను సిపియం సంపూర్ణంగా బలపరుస్తుంది. పార్టీ శ్రేణులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిస్తోంది.

= = = =